


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

గురువారం| 12 ఫిబ్రవరి 2026

పేజీలు 8


# మంత్రి గారూ..మా పిల్లల భవిష్యత్తు ఏంటీ..?

- డ్రాప్ ఇక్కడ..మరీ రోల్ ఎక్కడ..?
- గాల్లో పిల్లల విద్య..!!
- ఒక్క డ్రాప్ ఔట్ కూడా ఉండకూడదంటే ఇదేనా..?
- వచ్చే విద్యాసంవత్సరం తల్లికి వందనం పథకానికి అర్హత సాధించేరా..?



నన్నూరు ప్రాథమిక పాఠశాల


నన్నూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

# మార్చి 31వరకు జీడీపీ ఆయకట్టుకు

# సాగునీరు విడుదల

- కుడి, ఎడమ కాలువల కింద 12,500 ఎకరాలు పంట సాగు
- ఇక రైతులకు సాగునీటికి ఇబ్బంది లేనట్టే
- జీడీపీలో 2.5 టీఎంసీల నీరు

2లో


జీడీపీ ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన దృశ్యం

# పన్ను బకాయిల వసూళ్ల పై కఠినచర్యలు

- కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్.ఏ.సిరి

**కర్నూలు,మేజర్‌న్యూస్ :** జిల్లాలో పన్నుల వసూళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలపై కఠినంగా వ్యవహరించి వాటిని వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమీషనర్‌ను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జీఎస్‌టి అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెక్షన్ 51 ప్రకారం మిగతా 2లో


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ డా.ఏ సిరి

# వేళకు బస్సులు రావాయే..!!


బస్టాండులో బస్సుల కోసం నిరీక్షణ చేస్తున్న ప్రయాణీకులు

- ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం
- గంటల తరబడి ప్రయాణీకుల నిరీక్షణ
- ప్రయాణాలు చేయడానికి అవస్థలు పడుతున్న ప్రయాణీకులు

**పత్తికొండ, మేజర్‌న్యూస్ :** ఆర్టీసి బస్టాండు ప్రాంగణం మొత్తం ప్రయాణీకులతో కిక్కిరిసి పోతున్నా, వేళకు బస్సులు నడపకపోవడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగాలకు వెళ్లాల్సిన ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు మిగతా 2లో

## శ్రీ బ్రహ్మానందీశ్వరుల ఆహ్వానానికి

# బయలుదేరిన మహానందీశ్వరుడు


ప్రత్యేక అలంకారణలో స్వామివారిని ఉత్సవంగా తీసుకువెళ్తున్న దృశ్యం

**మహానంది, మేజర్ న్యూస్ :** శ్రీ బ్రహ్మానందీశ్వరుల ఆహ్వానానికి శ్రీ మహానందీశ్వర స్వామివారు నంద్యాలకు బయలుదేరి వెళ్లారు. బుధవారం సాయంకాలం స్వామి అమ్మవార్ల పల్లకిలో కొలువు దీర్చి ప్రత్యేక అలంకారాలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డిచే వేద పండితులు బహ్మశ్రీ రవిశంకర అవధాని మిగతా 2లో

# మురిసిన ముక్కంటి

- శ్రీగిరిలో అంగరంగ వైభవంగా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు
- మయూర వాహనం పై మల్లన్న విహారం
- పరమేశ్వరుడిని దర్శించుకుని పరవశించిన భక్తులు



మయూర వాహనం పై ఆశీనులైన స్వామి అమ్మవార్లు






మయూర వాహనం పై విహరిస్తున్న స్వామి అమ్మవార్లు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ఓ వైపు ప్రణమిల్లుతున్న భక్తకోటి..మరో వైపు బ్రహ్మోత్సవ వైభవంతో శ్రీగిరి క్షేత్రం శోభిల్లుతోంది. ఇరుముడితో తరలివచ్చిన శివస్వాములు స్పర్శ దర్శనం చేసుకుని పులకించిపోతున్నారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాల్గవరోజు బుధవారం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై విహరించగా భక్తులు దర్శించుకుని పరవశించిపోయారు. ముందుగా ఉభయ దేవాలయాల ప్రాంగణంలోని మిగతా 2లో

# మంత్రిగారూ.. మా పిల్లల భవిష్యత్తు ఏంటీ..?

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** వాళ్లంతా రెక్కాడితే గానీ డొక్కాడని కష్టజీవులు. తమ జీవితాల్లాగా పిల్లల జీవితాలు ఉండకూడదని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా బంగారు భవిష్యత్తును ఇచ్చేందుకు నిరంతరం తపన పడుతున్నా నిరుపేదలు. అయితే అధికారుల నిర్లక్ష్యం 20మంది విద్యార్థుల భవిష్యత్తు గాల్లో ఉందన్నది అక్షర నిజం. మండల విద్యా శాఖ అధికారి నుంచి ఉన్నత శాఖ అధికారులందరికి వారి భవిష్యత్తు అంధాకారంలో ఉందన్న విషయం తెలిసినప్పటికీ 5 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. మా పిల్లల భవిష్యత్తు అంటే అంత లెక్కలేనితనమా అంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలోని ఎస్‌సి కాలనీకి చెందిన 20మంది విద్యార్థులు ఏ పాఠశాలలో ఉన్నారో వారికే అర్థం కావడం లేదు. పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ కోసం ఎంఈఎంఓ నెంబర్ ఈఎస్ఈ02-13021/4/2024-ఈ7 9-1-2025న జారీ చేశారు. ఈ మెమో ప్రకారం ఒక గ్రామ పంచాయతీలో ఆదర్శ పాఠశాలల ఏర్పాటుకు ఆ గ్రామంలోని పాఠశాలల స్థితి గతులు, కమ్యూనిటీ, కమ్యూనిటీ పర అంశాలు వీటన్నింటిని మండల లేదా క్లస్టర్ స్థాయి కమిటీలు, సంబంధిత స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సూచనలు, వారి అంగీకరించాలని చెబుతుంది. అయితే ఈ మెమో ప్రకారం మండల విద్యా శాఖ అధికారులు గతేడాది మార్చి 3న పాఠశాలల కమిటీ తీర్మాణం కోరారు. ఆ తీర్మాణంలో ఎస్ఎంసి వారు నన్నూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను 1-5వరకు కొనసాగించాలని 3, 4, 5 తరగతులు వేరే పాఠశాలకు పంపరాదని తీర్మాణం చేశారు. అదే ఏడాది ఏప్రిల్ 11న రెండవసారి తీర్మాణం కోరగా మళ్లీ ఎస్ఎంసి కమిటీ 1-5తరగతులు కొనసాగించాలని చెప్పారు. విద్యా శాఖ మంత్రి, విద్యా శాఖ కమీషనర్‌లు ఎట్టి పరిస్థితుల్లో ఎస్ఎంసి అంగీకారం లేకుండా ఏ ఒక్క పాఠశాలను మార్పు చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇందుకు భిన్నంగా ఓర్వకల్లు మండల విద్యాధికారి నన్నూరు ప్రాథమిక ప్రత్యేక పాఠశాలను ఎస్ఎంఎస్ తీర్మాణానికి వ్యతిరేకంగా సమీపంలోని మెయిన్ పాఠశాలకు మ్యాప్ చేసి ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని అక్కడికి పంపారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా పాఠశాల ప్రారంభమైన రోజు 1-5వ తరగతి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు ఇతర కిట్లను అందించారు. డొక్క సీతమ్మ మధ్యాహ్నా భోజనం కూడా అందించారు. అయితే తమ పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో మెయిన్ స్కూల్‌కు పంపే ప్రసక్తే లేదని ఇక్కడే కొనసాగించాలని ఎస్ఎంసి డిమాండ్ చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. రవాణా, భద్రత, సామాజిక కోణం దృశ్య తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకునే వారు కావడం వల్లే వేరే పాఠశాలకు పంపించమని, పాఠశాలను ఇక్కడే కొనసాగించాలని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నత శాఖ అధికారులతో పాటు కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితకు విజ్ఞప్తి చేశారు. అయితే వాళ్ల విజ్ఞప్తిని ఇంతవరకు ఎవ్వరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో ఉంది. గతేడాది సెప్టెంబరు 11 నుంచి 3, 4, 5 తరగతులకు చెందిన 20మంది పిల్లలను హాజరు పట్టిక నుంచి తొలగించారు. తొలగించిన పిల్లలను ఏ పాఠశాలలో కూడా మ్యాప్ చేయలేదు..హాజరు లేదు..సెమిస్టర్-2 బుక్స్ అందించలేదు. ప్రస్తుతం ఈ 20మంది విద్యార్థులు స్థానిక పాఠశాలలోనే విద్యనభ్యసిస్తున్నారు. చేసేది లేక మధ్యాహ్నా భోజనం ఎస్ఎంసి సభ్యులు, గ్రామ పెద్దలు తమ సొంత నిధులతో అందిస్తున్నారు. మరోవైపు విద్యా శాఖ అధికారులకు తమ పిల్లల భవిష్యత్తు కంటే వారికి ముఖ్యమైన పనులు ఏముంటాయో తెలియదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఒక్క డ్రాప్‌ఔట్ కూడా ఉండకూడదని కచ్చితమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఒకేసారి 20మంది విద్యార్థుల భవిష్యత్తుతో సంబంధిత శాఖ అధికారులు ఆడుకోవడం సమంజసం కాదని వాపోతున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో తమ పిల్లలకు తల్లికి వందనం పథకం పడుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

**తమ పరిధిలో లేదు :- ఎంఈఓ ఓంకార్ యాదవ్ :** నన్నూరు ప్రాథమిక ప్రత్యేక పాఠశాలను గతంలో ఆర్‌జెడి సందర్శించారని తల్లిదండ్రులను ఒప్పించే ప్రయత్నం చేశారన్నారు. కమీషనర్ పరిధిలో ఉందని స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితకు, డిఈఓల దృష్టికి తీసుకెళ్లామని సమాధానం దాటవేశారు.

# వేళకు బస్సులు రావాయే.. !!

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లే విద్యార్థులు అత్యావసరంగా ఆసుపత్రులకు వెళ్లాల్సిన రోగులు గంటల తరబడి బస్టాండులో నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఆర్టీసి డిపోలో షెడ్యూల్ ప్రకారంగా నడపాల్సిన బస్సులను నడపడం లేదని ఆర్టీసి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు ఆరోపిస్తున్నారు. పత్తికొండ నుండి పనుల నిమిత్తం ఆదోని, కర్నూలు, గుంతకల్లు, గుత్తి, అనంతపూర్, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణీకులకు సమయానికి బస్సులు రాక గంటల తరబడి బస్టాండు ప్రాంగణంలో నిరీక్షణ చేస్తూ, నరకయాతన అనుభవిస్తున్నట్లు ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పత్తికొండ నుండి ఆదోనికి నిత్యం పనుల నిమిత్తం రోజువారిగా వెళ్తూ ఉంటారు. ఉద్యోగులకు, విద్యార్థులకు ఉదయం పూట బస్సులు సమయానికి లేకపోవడం వలన ఉద్యోగులు విధులకు హాజరు కాలేక విద్యార్థులు కళాశాలలకు సమయానికి చేరుకోలేక పోతున్నామని బాధను వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆదోని నుండి పత్తికొండ ప్రాంతానికి సాయంత్రం పూట కూడ సమయానికి బస్సులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతూ, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని మహిళలు మనోవేదనకు గురవుతున్నారు. విచారణకౌంటర్లలో సమాచారం అడిగితే ఆర్టీసి అధికారులు ప్రయాణీకులకు సరైన సమాధానం చెప్పడం లేదంటూ వాపోతున్నారు. షెడ్యూల్ ప్రకారం నడపాల్సిన బస్సులను ఆర్టీసి సిబ్బంది వేళ పాళా లేకుండా నడుపుతుండడంతో సామాన్య ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వేళకు బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

## శ్రీమఠంలో
# మన్యాయ సుధ పరీక్ష

**మంత్రాలయం, మేజర్‌న్యూస్ :** మంత్రాలయంలో ఉన్న శ్రీ గురు సార్వభౌమ న్యాయ సుధా విద్యార్థులు పరీక్ష విజయవంతంగా ప్రారంభమైందని కార్యక్రమాన్ని శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ విద్యాశ్రీ షా తీర్థులు జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. విద్యార్థులు శ్రీనిధి బాలసుబ్రమణ్యం సుదన్వ హార్షవర్ధన్ సుతేజ విద్యార్థులను మూల్యాంకనం చేయడంలో దేశం నల్లమల నుండి ప్రముఖ పండితులు పాల్గొన్నట్లు తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఠాధిపతులు

# కొత్తపేటలో పట్టపగలే ఇంట్లో చోరీ

★ ఐదు తూలాల బంగారం,రూ.67 వేల నగదు అపహరణ

★ పోలీసులు కర్నూల్ క్లూస్ టీం తనిఖీ



**హొళగుంద,మేజర్‌న్యూస్ః** హొళగుంద మండలం నెరణికి తాండ గ్రామ పంచాయతీ పరధిలోని మజర గ్రామమైన కొత్తపేటలో బుధవారం పట్టపగలే గ్రామానికి చెందిన ఆటో అంపయ్య ఇంటో చోరీ జరగింది.ఆ గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. అంపయ్య ఆటోను నడుపుతున్నాడు.భార్య దేవమ్మ స్కూల్‌లో స్వీపర్ పని చేస్తుంది.పని నిమిత్తం అంపయ్య ఆటోతో కర్ణాటక బళ్ళారికి పోయాడు.భార్య దేవమ్మ రోజు వారిగా ఇంటికి తాళం వేసుకుని స్కూల్‌కు వెళ్లింది.ఇంట్లో ఎవరు లేని సమయం చూసి గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగళగొట్టి,ఇంటిలోపలకి చోరబడి లోపల బిరువా తాళం పగలగొట్టి సంపాదించి పెట్టిన ఐదు తులాల బంగారు ఆభరాణాలు,రూ.67 వేలు నగదును అపహరించుకుని వెళ్లారని చెప్పారు.తీర దేవమ్మ ఇంటికి వచ్చి చూసి బిరువాలో చిందరవందరమైన వస్తువులను చూసి కేక వేస్తు మా ఇంటో దొంగలు పడ్డారని లబోదిబోమని బోరునా విలపించింది.వెంటనే భర్త అంపయ్యకు ఫోన్ చేసి సమాచారం అందించింది.హుటాహుటిన అంపయ్య వచ్చి దృశ్యాన్ని చూసి అవాక్కు అయ్యాడు.వెంటనే హొళగుంద పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు.హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనాయక్ సిబ్బంది గ్రామానికి చేరుకుని ఇంట్లో చోరీ జరిగిన దృశ్యాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.కర్నూల్ క్లూస్ టీమ్ వచ్చి ఇంటో ఆధారాలను సేకరించారు.చోరీ జరిగిన కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మార్చి 31వరకు జీడీపీ ఆయకట్టుకు సాగునీరు విడుదల



సాగు చేసుకున్న శనగ పంట

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులకు సాగునీటికి ఇబ్బంది లేదు. కుడి, ఎడమ కాలువ ద్వారా నిరంతరం పంటలకు నీరు విడుదల అవుతుంది. గత ఏడాది, ఈ ఏడాది కూడా జీడీపీ ఆయకట్టు రైతులు రబీలో పంటలను సాగు చేసుకుంటున్నారు. ప్రాజెక్టు కింద 125000 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే కుడి, ఎడమ కాలువ చివర్లో కాలువలు సరిగా లేకపోవడం ఆయకట్టు కొంత మేర తగ్గింది. అయితే ఈ ఏడాది ప్రాజెక్టు కింద 12500 ఎకరాలు పంట సాగు అయింది. వేరుశనగ, మొక్కజొన్న, వరి, మిరప, కంది, ఉల్లి, ఆముదాలు, మినువ ఋలు తదితర పంటలను రైతులు సాగు చేశారు. పంటలు మార్చి 31 వ తేది లోపు చేతికి అందుతాయని అంత వరకు సాగు నీరు అందజేస్తామని జీడీపీ అధికారులు ప్రకటించారు. దీంతో సాగు చేసిన పంటలు మార్చి చివరి లోపు చేతికి అందుతాయా లేదా అన్నది అనుమానమే.. అని రైతులు తెలుపుతున్నారు. వైసీపీ ప్రభుత్వ సమయంలో ఆయకట్టు రైతులకు సాగు నీరు లేక క్రాప్ హాలీడే ప్రకటించుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే గత ఏడాది, ఈ ఏడాది కూడా జీడీపీ ఆయకట్టు రైతులు రబీలో పంటలను సాగు చేసుకుంటుండడంతో ఇప్పుడు పరిస్థితులు మారాయన్నది వెల్లడవుతుంది..? హంద్రీనీవా నుంచి జీడీపీకి నీరు విడుదల అవుతుందడటంతో పంటలు పూర్తిగా చేతికి అందేవరకు నీటి విడుదల ఉంటుందని తెలుస్తుంది.

# పన్ను బకాయిల వసూళ్లపై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

అన్ని ప్రభుత్వ విభాగాలు, స్థానిక సంస్థలు జిఎస్‌టి రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. అలాగే వారు ప్రతి నెల 20వ తేదీలోపు రిటర్న్లు ఫైల్ చేయాలన్నారు. లావాదేవీలు లేకపోయినా నిల్ రిటర్న్లు దాఖలు చేయడం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో కొనసాగుతున్న అన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల వివరాలను కమర్షియల్ ట్యాక్స్ వారికి అందించాలని, తద్వారా కాంట్రాక్టర్లు సరిగ్గా పన్నులు చెల్లిస్తున్నారో లేదో తనిఖీ చేయవచ్చున్నారు. నకిలీ బిల్లులతో వ్యాపారం చేస్తూ పన్ను ఎగవేస్తున్న బోగస్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిఎస్‌టి రేట్లు తగ్గినప్పుడు ఆ ప్రయోజనం నేరుగా వినియోగదారులకు అందుతుందో లేదో లీగల్ మెట్రాలజీ అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమీషనర్ నీరజ మాట్లాడుతూ పన్నుల వసూళ్లు, బకాయిలు తదితర అంశాల గురించి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఈఓ నాసరరెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మురిసిన ముక్కంటి

(మొదటి పేజీ తరువాయి)

అలంకార మండపంలో మయూర వాహనాన్ని సుగంధ పుష్పాలతో ముస్తాబు చేసి స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆశీనులను చేశారు.ఉభయ దేవాలయల ప్రధాన అర్చకులు,వేద పండితులు అర్చనలు,ప్రత్యేక హారతులు ఇచ్చారు.స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలు,కళాకారుల సంగీత,జానపద నృత్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేయించారు.అనంతరం గంగాధర మండపం నుంచి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.కళాకారుల ప్రదర్శనలుకొనసాగుతుండగా,భక్తుల శివ నామస్మరణ హోరెత్తుతుండగా మయూర వాహనంపై శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున విహరించారు. స్వామి అమ్మవార్లను భక్తులు కనులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు.ఉత్సవంలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుకుంట రమేష్ నాయుడు,కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీబహ్మానందీశ్వరుల ఆహ్వానానికి బయలుదేరిన మహానందీశ్వరుడు

**మహానంది, మేజర్‌న్యూస్ :** శ్రీ బ్రహ్మనందీశ్వరుల ఆహ్వానానికి శ్రీ మహానందీశ్వర స్వామివారు నంద్యాలకు బయలుదేరి వెళ్లారు. బుధవారం సాయంకాలం స్వామి అమ్మవార్ల పల్లకిలో కొలువుదీర్చి ప్రత్యేక అలంకారాలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డిచే వేదపండితులు బహ్మశ్రీ రవిశంకరఅవధాని వేదమంత్రాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు మహాశివరాత్రి పర్వదినం రోజున జరిగే కళ్యాణానికి కళ్యాణ పెద్దలయిన శ్రీగంగాపార్వతి సమ్మేతంగా శ్రీ బ్రహ్మనందీశ్వరస్వామి వార్ల ఆహ్వానానికి బయలుదేరి వెళ్లారు. గ్రామాగ్రామాన ప్రజలు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఇవో మధు, ఆలయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రమదానంలో పాల్గొన్న విద్యార్థులు

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో అహోబిలం మఠం చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామానుజన్ ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రమదానం చేసి కోనేరును శుభ్రపరచడం జరుగుతుంది. ఈ సందర్భంగా అధ్యాపకులు సమాజ సేవకులు డాక్టర్ గంగన్న మాట్లాడుతూవిద్యార్థులు చదువుతో పాటు, సమాజం లో సేవతో పాటు సమాజంలో మంచి పేరు తెచ్చుకొని, తల్లిదండ్రులకు కూడా సేవ చేసినప్పుడే మీకు మంచి గుర్తింపు వుంటుందని తెలిపారు.దేవాలయం ఆఫీస్ శివ, సునిల్, నాగేంద్ర , సురేష్, నర్సింహులు, అనిల్, శేఖర్ , శ్రీనివాసులు,క్రిష్ణి, సురేంద్ర , నిఖిల్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛ అహోబిలం కార్యక్రమంలో పాల్గొన్న అనంత ఎన్సిసి విద్యార్థులు

**ఆళ్లగడ్డ, మెజర్ న్యూస్ :** పుణ్యక్షేత్రమైన అహోబిలం లో జరుగుతున్న స్వచ్ఛ ఆహోబిలం కార్యక్రమంలో ఆళ్లగడ్డ అనంత కళాశాల విద్యార్థులు బుధవారం పాల్గొన్నారు. అహోబిల దేవస్థానం సీ ఏవో వి ఎల్ ఎన్ రామానుజన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా స్వచ్ఛ అహోబిలం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆనంత డిగ్రీ కళాశాల ఎన్సిసి విద్యార్థులు ఉత్సాహంగా అనంత విద్యాసంస్థల అధినేత అనంతరం సుబ్బారెడ్డి తో కలిసి పుష్కరిణిలో పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు సమాజ బాధ్యత, సేవా భావం, దేశభక్తి వంటి విలువల ప్రాముఖ్యతను వివరించి వారికి ప్రేరణ కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్వయంగా శుభ్రత కార్యక్రమంలో పాల్గొని ఆదర్శంగా నిలిచారు.



పుష్కరిణిలో పూడికతీత పనుల్లో పాల్గొన్న అనంత కళాశాల ఎన్సిసి విద్యార్థులు

కళాశాల ఎన్‌సీసీ విద్యార్థిని, విద్యార్థుల సేవాభావం మరియు సమాజ పట్ల వారి అంకితభావాన్ని స్థానిక ప్రజలు ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలు యువతలో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు దోహదపడతాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

# తిరుమల లడ్డూ పై టిడిపి నాయకులు దుష్ప్రచారం మానుకోవాలి.. వైసిపి నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

**తుగ్గలి,మేజర్ న్యూస్:** ప్రపంచ కలియుగ దేవుడు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం పై టిడిపి నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని వైయస్సార్ సిపి నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన తుగ్గలి లో మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి నివాస గృహంలో మండలానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు బుధవారము విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వైయస్సార్సిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారెడ్డి, ఎస్టీ సెల్ జోనల్ అధ్యక్షులు నారాయణ నాయక్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్, మేధావులు ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి రాతనమోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి తుగ్గలి మోహన్ రెడ్డి, ఐటి తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఆర్.టి.ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అట్లా గోపాల్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు సిట్ తమ ఛార్జ్ సిట్‌లో నెయ్యిలో ఎటువంటి జంతువుల కొవ్వు కలపలేదని పేర్కొనడంతో కూటమినాయకులు కుంగుతున్నారన్నారు. తిరుమల లడ్డు తయారీలో వినియోగించే నెయ్యిలో ఎలాంటి జంతువుల కొవ్వు కలవలేదని సిట్ తేల్చిన నేపథ్యంలో టిడిపి నాయకులు తిరుమల లడ్డు ప్రసాదం పై చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని పేర్కొన్నారు.వైసిపి నాయకులు అమీనాబాద్ రామాంజనేయులు, బొంది మడుగుల ఈశ్వర్ రెడ్డి, రామకొండ సుధాకర్ రెడ్డి, మారెళ్ళ సుధాకర్ రెడ్డి, లింగన్న, కొట్టాల సయ్యద్ హుస్సేన్ భాష, ముక్కెళ్ల గోవర్ధన్‌రెడ్డి,మామిల్లకుంటుసత్తప్ప,సురేష్,వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

# గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి మచ్చ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో వైసిపి నేతలు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్ అన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు రాష్ట్ర గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో



మాట్లాడుతున్న పోతురాజు రవికుమార్

వైసిపికి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని నినాదాలు చేసి ప్రసంగాన్ని అడ్డుకోవడం దారుణమన్నారు. 11మంది ఎమ్మెల్యేలతో ఉన్న పార్టీకి ప్రతిపక్ష హోదా ఎలా దక్కుతుందన్నారు. ప్రసంగం సమయంలో శాంతిభద్రతలు కాపాడాలంటూ నినాదాలు చేసి అడ్డుకోవడం సరైంది కాదన్నారు. అసెంబ్లీ అనేది ప్రజల సమస్యల పై చర్చించడానికి, ప్రజాస్వామ్య పద్ధతిలో అభిప్రాయాలు వెల్లడించడానికి ఏర్పాటైన అత్యున్నత వేదిక అని అలాంటి సభలోనే శాంతిగా ఉండలేని వారు రాష్ట్ర ప్రజల సమస్యలపై చర్చించలేని వారు కేవలం నినాదాలు చేసి గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. వైసిపి నేతలు తమ వైఖరిని మార్చుకొని శాసనసభ గౌరవాన్ని కాపాడేలా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివ తదితరులున్నారు.

# క్యాబ్ బుక్ చేసుకున్నంత సులభంగా రైతులకు అందుబాటులో కిసాన్ డ్రోన్లు

**గడివేముల మేజర్ న్యూస్ :** క్యాబ్ బుక్ చేసుకున్నంత సులభంగా వ్యవసాయ అవసరాల కోసం డ్రోన్ సేవలు బుకింగ్ చేసుకోవచ్చని గడివేముల మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అన్నారు. డ్రోన్ సేవలతో పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ భూముల పై చల్లుకునే సౌకర్యం ఉందనీ,దీనివల్ల సమయం ,కూలీల వ్యయం గణనీయంగా తగ్గుతుందన్నారు .రైతులు ప్లే స్టోర్లో అందుబాటులో ఉన్న యుబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్ యాప్ ద్వారా లేదా క్యూ ఆర్ కోడ్ ద్వారా డ్రోన్ సేవలను పొందవచ్చని,ఏపీ ఏఐఎంఎస్



యాప్ లో అనేక వ్యవసాయ సేవలు పొందే వీలు ఉందన్నారు. రైతులకు మరింత సౌలభ్యం కల్పించే దిశగా ప్రతి గ్రామంలో అద్దెకు డ్రోన్ సేవలు అందుబాటులో ఉన్నాయనీ, ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే రైతులందరూ తప్పకుండా రైతు విశిష్ట నెంబర్ కోసం మీ గ్రామంలోని రైతు సేవా కేంద్రాలలో లేదా జూజ సెంటర్స్ ను సంప్రదించి వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.రైతు విశిష్ట నెంబర్ ఉన్న రైతులకు మాత్రమేపీవీ కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట కొనుగోలు, పంట నష్ట పరిహారాలు మొదలగు ప్రభుత్వ పథకాలు పొందుతారన్నారు. బుధవారం బిలకలగూడూరు గ్రామంలో కిసాన్ డ్రోన్ యాప్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో జీకే . పవన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి, విజయ రాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో నిందితుల అరెస్ట్

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలో ఇటీవల శ్రీనివాస జువెలరీ షాపులో చోరీ చేసిన నిందితులను బనగానపల్లె పోలీసులు చాకచక్యంగా పట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డోన్ డి.ఎస్.పి శ్రీనివాసులు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలోని శ్రీనివాస జువెలరీ షాపులో 18.4 తులాల బంగారం, 8కేజీల వెండి చోరీకి గురి కాగా వెంటనే స్పందించిన బనగానపల్లె సి.ఐ ప్రవీన్ కుమార్, సీసీఎస్ ఎస్.ఐ సురేష్ కుమార్, ఎస్.ఐలు దుగ్గిరెడ్డి, కల్పనలు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించి సీసీ టి.వి ఫుటేజ్, టెక్నికల్ ఆధారాలను తీసుకొని కేసును ఛేదించడం జరిగిందని నిందితులను బుధవారంనాడు పాణ్యం సమీపంలోని మూతబడిన స్టీల్ ఫ్యాక్టరీ నందు అరెస్ట్ చేయడం జరిగింది. మొత్తం 6మంది నిందితులు తెలంగాణా రాష్ట్రానికి చెందినవారు. మహమ్మద్ ఇమ్రాన్, షేక్ మహబూబ్ ఇబ్రహీం, మహ్మద్ నజీర్, సాదుల్లా, షేక్షావలి, బాలక్రిష్ణ



అలియాజ్ బాలాజి అను ఆరు మంది మైలార్దేవుపల్లె రాజేంద్ర నగర్‌కు చెందినవారని డి.ఎస్.పి శ్రీనివాసులు తెలిపారు. గత కొంత కాలం క్రితం అవుకు మండలంలో జరిగిన ఒక జాతరకు వచ్చారని వారు ఆరుగురు ఒక బొలేరో వాహనానికి వెనుక వైపున తార్పాల్ పట్టా కట్టుకొని అందులో షట్టర్ కటింగ్‌కు కావాల్సిన సామాగ్రిని తీసుకొని వచ్చి వెల్డింగ్ సహాయంతో షట్టర్ రార్డను కట్ చేసి చోరీకి పాల్పడటం జరిగిందని చోరీకి గురైన బంగారం , వెండి మొత్తం వారి వద్ద లభించిందని ఈ ఘటనపై కేసున మోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

## పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలను బలోపేతం చేయాలి-కోట్ల హర్షవర్ధన్ రెడ్డి



**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** కోడుమూరు నియోజకవర్గంలో వైసీపీ పార్టీ బలోపేతం పై నియోజకవర్గం నాయకులు ఇప్పటి నుండే కసరత్తు ప్రారభించారు. అందులో భాగంగా మండల వారిగా ప్రత్యేక సమావేశం నిర్వహించి ఈసందర్భంగా నియోజకవర్గంలో వైసీపీ బలోపేతం కోసం గ్రామస్థాయిలోకమిటీలను ఏర్పాటుచేసి అందులోసామజిక,రాజకీయ అవగాహనా కలిగిన ఉత్సహవంతులకు స్థానం కల్పించి గ్రామ, మండల స్థాయిలో వివిధ విభాగలకు నామినేట్ చేయాలనీఅందుకు గ్రామ,మండల నాయకులు కృషి చేయాలనీ సూచించారు. గ్రామ స్థాయిలో కమిటీలను బలోపేతం చేసి రాబోయే స్థానిక ఎన్నికల్లో జయకేతానం ఎగరావేసేందుకు గ్రామ కమిటీలే కీలకమని అందుకు అదిశగా మండల,గ్రామ నాయకులు కృషి చేయాలనీ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమ శేఖర్ రెడ్డి మరియు మండల,గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై సమన్వయ కమిటీ సమావేశం

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** బ్రహ్మగుండం క్షేత్రంలో ఈనెల 15వ తేది నుండి నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహోత్సవాల నేపథ్యంలో ఆలయ ఈఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. అన్ని శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, అర్చకులు, ఆలయ సిబ్బంది సమన్వయంతో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బ్రహ్మగుండం క్షేత్రం శివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి టి.హనుమంతరావు తెలిపారు. స్వామి సేవలు, భక్తుల దర్శనం, పరిశుభ్రత, భద్రత, కళ్యాణం, రథోత్సవం వంటి అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉత్సవాల నిర్వహకులు బొమ్మన రాజశేఖర్‌రెడ్డి, ఇంచార్జ్ తహశీల్దార్ గురుస్వామిరెడ్డి, ఏఎస్సై బాలకృష్ణ, మండల పరిషత్ ఏఓ లలిత, మేజర్ పంచాయితీ సెక్రటరీ లక్ష్మినాథ్, ఆర్ఐ మంజుల, విఆర్ఓ పద్మ, విద్యుత్ లైన్‌మెన్ ఈరయ్యఆచారి, ఆర్‌టిసి డోన్ డిపో సిబ్బంది కామేశం, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నిర్వహకులు

# శివస్వాములపై లాఠీఛార్జి దుర్మార్గమైన చర్య..

**వాల్మీకి ఎస్టి సాధన పోరాట కమిటీ జిల్లా అధ్యక్షులు వెంకటనాయుడు**

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** భక్తిశ్రద్ధలతో 41రోజులపాటు శివమాల ధరించి ఇరుముడితో శ్రీశైలం దేవస్థానానికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులపై పోలీసులు లాఠీలతో విచక్షణారహితంగా దాడి చేయడం అత్యంత విచారకరమని వాల్మీకి ఎస్టి సాధన పోరాట కమిటీ జిల్లా అధ్యక్షులు వెంకటనాయుడు అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని శ్రీసిద్దేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శివమాలదారులతో కలిసి ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌నాయుడు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో సామాన్య భక్తులపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న వెంకట్‌నాయుడు

# టీడీపీ కార్యకర్త మృతి తీరని లోటు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** టీడీపీ సినియర్ కార్యకర్త పెయింటర్ ఇనాయతుల్లా మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని 2వ వార్డు టీడీపీ ఇంచార్జి తురేగల్ నజీర్ ఆహమ్మద్ పేర్కొన్నారు. ఇనాయతుల్లా మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆయన భౌతికకాయాన్ని నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తురేగల్ నజీర్ మాట్లాడుతూ ఇనాయతుల్లా తెలుగుదేశం పార్టీలో చురుకుగా పనిచేసే వారని, వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బీవీ అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సరోజమ్మ, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# తల్లిదండ్రులను గౌరవించాలని - బి.సి రాజారెడ్డి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్యాబుద్ధులు నేర్పించిన గురువులపట్ల ఎప్పటికీ గౌరవ మర్యాదలతో మెలగాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పచ్ బి.సి రాజారెడ్డి అన్నారు. బుధవారంనాడు రవ్వలకొండ శ్రీశ్రీశ్రీ హట్టిమునిస్వామి ఆశ్రమం నందు అధ్యాత్మిక సభ వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా భగవద్గీత ప్రవాచికలు, గురుజి వి. రామశేషయ్య జన్మదినం సందర్భంగా బి.సి రాజారెడ్డి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి శాల్వ కప్పి సన్మానించారు. అనంతరం మునిస్వామి చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. మానవ జీవితం ఎంతో ఉత్తమమైనదన్నారు. ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక చింతనతో వెలుగుతూ సమాజానికి మేలు జరిగే పనులలో భాగస్వాములు కావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మానవసేవే మాధవ సేవ అని మనకున్న దాంట్లో సాయం చేసే మనస్సును కలిగి ఉండాలన్నారు. గురూజి రామశేషయ్య భగవద్గీత ప్రవచనాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా యూట్యూబ్ ఛానల్ ద్వార ప్రచారం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురూజి రామశేషయ్య, దొంతా వెంకటేశ్వర్లు, రామసుబ్బారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com



# బాక్సింగ్ పోటీలలో పతకాలు సాధించిన నంద్యాల జిల్లా క్రీడాకారులు



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** సికింద్రాబాద్ బొల్లారం ఫుట్ బాల్ గ్రౌండ్ లో తెలంగాణ బాక్సింగ్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో నంద్యాల జిల్లా క్రీడాకారులు పాల్గొని 15 పతకాలు సాధించారు. వీరు అవుకు మదర్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కు చెందిన విద్యార్థులు కబ్, సబ్ జూనియర్ విభాగాలలో వివిధ వెయిట్ కేటగిరీలలో జయశ్రీ , యశ్వంత్‌నాయక్, చంద్రకాంత్ ఆచారి, నంద సాత్విక్ రెడ్డి, దీపిక, లక్ష్మీ షర్మిల ,జ్ఞాన ప్రసన్న స్వర్ణ పతకాలు సాధించగా, తపస్వి భాయ్ ,సుశాంత్ ,పూజిత రజత పతకాలు, వైష్ణవి, మణి చరణ్, ధీరజ్ ,లక్ష్మణ్, హరిప్రియలు కాంస్య పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి, రాష్ట్ర సంఘం కార్యవర్గ సభ్యుడు ఫయాజ్ ఆధ్వర్యంలో మధుమణి సమావేశ భవనంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ జి. రవికృష్ణ, కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అతిథులుగా పాల్గొని విజేతలను,కోచ్‌లుఫయాజ్, చంద్ర, ప్రసాద్,మదర్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్ లనుశాలువలతో సత్కరించారు.పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులకు అభినందనలు తెలిపారు.జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్, కోచ్ లు చంద్ర, ప్రసాద్, మదర్ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీలో చేరిన ఆకుమళ్ల వైసీపీ కార్యకర్తలు

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె నియోజకవర్గ పరిధిలోని ఆకుమళ్ల గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు బుధవారంనాడు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బి.సి జనార్దన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలపట్ల



పార్టీలో చేరిన కార్యకర్తలతో బి.సి ఇందిరమ్మ

ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. బి.సి ఇందిరమ్మ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తుందని ప్రజల అవసరాలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుమళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మల్లు మహేశ్వర రెడ్డి, కైప వెంకట రమణా రెడ్డి, ఏరాసు పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**– భక్తులకు అన్నదానం అభినందనీయం**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** శ్రీశైల మహాక్షేత్రానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేసినట్లు రెడ్‌క్రాస్‌సొసైటి అధ్యక్షులు , తహశీల్దార్ రత్నరాధిక తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో శ్రీశైలం వెళ్లే భక్తులకు రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో మండల కమిటి సభ్యులు ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయగా తహశీల్దార్ రత్నరాధిక సందర్శించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవగా భావించి రెడ్ క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో ఎన్నో సంవత్సరాలుగా ఉచిత వైద్యసేవలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలను అందించడం జరుగుతుందన్నారు. రెడ్ క్రాస్ సొసైటి భక్తులకు సేవలందించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే కృష్ణాపురం గ్రామంలో భక్తులకు అందిస్తున్న అన్నదాన శిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. భక్తులతో ముచ్చటిస్తు వారికి భోజనాన్ని తానే



ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న తహశీల్దార్ రత్నరాధిక

వడ్డించింది. శ్రీశైలం శివయ్యను దర్శించుకునేందుకు ఎన్నో వ్యయప్రయాసలకు నోచుకోని పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు ఓటర్లు సహకరించాలి

**:- కమీషనర్ పి విశ్వనాథ్**

**కర్నూలు (కేఎంసీ), మేజర్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు ఓటర్లు సహకరించాలని ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారి, కమీషనర్ విశ్వనాథ్ కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై నియోజకవర్గ బిఎల్ఓలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రీ-ఇంటెన్సివ్ రివిజన్ సర్వే పురోగతిని సమీక్షించారు. దిగువన ఉన్న పోలింగ్ కేంద్రాల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు మైక్ ప్రకటనలు, బ్యానర్ల ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. అర్హులైన



మాట్లాడుతున్న కమీషనర్ విశ్వనాథ్

ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావాలన్నారు. ఓటరు జాబితా సవరణలో కచ్చితత్వం అత్యంత కీలకమన్నారు. బిఎల్ఓలు ఇంటింటికి వెళ్లి వివరాలను ధృవీకరిస్తూ పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలన్నారు. సందేహాల నివృత్తి కోసం 1950కు కాల్ చేయవచ్చన్నారు.

# షర్మిల యాత్రకు సహకరించండి



ఎస్పీకి పూలబొకే అందచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి చేపట్టనున్న ఉపాధి హామీ పరిరక్షణ యాత్రకు జిల్లా పోలీసులు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు క్రాంతి నాయుడు అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందచేసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న షర్మిల రెడ్డి చేపడుతున్న ఉపాధి హామీ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయడానికి పోలీసు యంత్రాంగం సహకారం కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ జిలానీ, లాజరస్, బజారన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నాలుగవ రోజుకు చేరడంతో శ్రీశైల క్షేత్రం భక్తులతో పోటెత్తింది.జిల్లా కలెక్టర్ రాజకుమారి,ఎస్పీ సునీల్ షోరాణ్ కమాండ్ కంట్రోల్ ద్వారా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ట్రాఫిక్ నియంత్రణ, దర్శనాల నిర్వహణ,అన్నప్రసాద వితరణ, పార్కింగ్ అంశాలపై అధికారులకు కీలక సూచనలు చేశారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని వారు ఆదేశించారు.

**సిహెచ్సీ తనిఖీ చేసిన కలెక్టర్ :** మహా శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి వచ్చే భక్తులకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ రాజకుమారి ఆరా తీశారు. బుధవారం 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రథమ చికిత్స,అత్యవసర సేవలు, ఔషధాల లభ్యత,పడకల సదుపాయం,శుభ్రతపై సమీక్షించారు.రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా సమయానికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు ఆమె సూచించారు.

## కాణిపాకం దేవస్థానం వారిచే మల్లన్నకు పట్టువస్త్రాల సమర్పణ



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ వరసిద్ది వినాయకస్వామి దేవస్థానం, కాణిపాకం వారు బుధవారం ఉదయం శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. కాణిపాక దేవస్థానం తరుపున ఆ దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు మణినాయుడు,కార్యనిర్వహణాధికారి కె.పెంచలకిషోర్,దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు,అర్చక స్వాములు ఈ పట్టువస్త్రాలను సమర్పించడం జరిగింది.ఈ సమర్పణ కార్యక్రమంలో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు,ఈవో యం. శ్రీనివాసరావు,పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు,అర్చక స్వాములు,వేద పండితులు, శ్రీ వరసిద్ది వినాయకస్వామి దేవస్థానం అధికారులకు స్వాగతం పలికారు.తరువాత ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కాణిపాక దేవస్థాన అధికారులు,అర్చకులు మేళతా ళాలతో ఆలయ ప్రవేశం చేసి వస్త్ర సమర్పణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాలలో శ్రీస్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలలో శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకోవడం వలన ఎంతో ఆధ్యాత్మికానుభూతి కలిగిందన్నారు.కాణిపాక దేవస్థానం తరుపున శివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఆనవాయితీగా పట్టువస్త్రాలను సమర్పించడం జరుగుతోందన్నారు.

## ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించిన డివిజనల్ డెవలప్మెంట్ అధికారి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ టి.శివారెడ్డి సందర్శించారు.ఇందులోభాగంగా పంచాయతీ కార్యదర్శులు ఎస్ జి ఎస్ డబ్ల్యూ సిబ్బందితో సమావేశమయ్యారు.ఇంటి పన్ను వసూలు, పారిశుద్ధ్యం గురించి ఆయన సూచనలు జారీ చేశారు. ఏకీకృత కుటుంబ సర్వే, వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర), సిటిజన్ ఈ కేవైసీ తప్పనిసరి అన్నారు, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేషన్, ఇతర సంబంధిత సర్వేలు వంటి కొనసాగుతున్న ఎస్ జి ఎస్ డబ్ల్యూ సర్వేలను కూడా ఆయన నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎంపీడీవో నూర్జహాన్ పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న డిఎస్ ఎస్ డబ్ల్యూఓ శివారెడ్డి

## పీజీఆర్ఎస్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి - ఆదోని సబ్ కలెక్టర్

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** ప్రజలు పీజీఆర్ఎస్ లో ఇచ్చిన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ అజయ్కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రమైన గోనెగండ్లలోని తహసీల్దార్ కార్యాలయంను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్కలెక్టర్ అజయ్కుమార్ మండల సర్వేయర్, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పీజీఆర్ఎస్లో ఎన్ని సమస్యలు వచ్చాయి, ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరించారు. ఇంకా ఎన్ని పెండింగ్లో ఉన్నాయి. పరిష్కరించిన వారితో పోటోలు దిగి ఉన్నతాధికారులకు పంపారా లేదా అని తెలుసుకున్నారు. అలాగే సచివాలయాలకు గాని ఇతర కార్యాలయాలకుగాని పనుల నిమితం ప్రజలు వస్తే వార సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## కుటుంబ ఏకీకృత సర్వేలను వేగవంతం చేయాలి-డిప్యూటీ ఎంపీడీఓ



**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** కుటుంబ ఏకీకృత సర్వేలను వేగవంతం చేయాలని సచివాలయం అధికారులకు డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి సూచించారు.బుధవారం కుటుంబ యూనిఫైడ్ సర్వేను పరిశీలించిన డిప్యూటీ ఎంపీడీఓ అందులో భాగంగా సంగాల, తిమ్మందొడ్డి గ్రామాలలో కుటుంబ ఎక్కికృత సర్వేలను వేగవంతం చేసి, ఇంటి పన్ను లక్ష్యాలను పూర్తి చేయాలనీ సచివాలయం అధికారులను ఆదేశించారు. సర్వేలో వెనకబడిన గ్రామాలలో పురోగతి సాధించాలని అందుకు సచివాలయం అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి,సచివాలయం అధికారి సుంకన్న,మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల

**బేతంచెర్ల,మేజర్ న్యూస్ :** బేతంచెర్ల పట్టణంలోని సుందరయ్య కాలనీలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి చొరవతో ఏళ్ల నాటి త్రాగునీటి సమస్య పరిష్కరమైనదని రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు అన్నారు.వారు మాట్లాడుతూ కాలనీలో ప్రజలు వేసవికాలంలో త్రాగు నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పద్దారని అన్నారు. త్రాగు నీటి సమస్యను ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి దృష్టికి కాలనీవాసులు తెలపడంతో ఎమ్మెల్యే స్పందించి నూతన బోరును మంజూరు చేశారు. బుధవారం కాలనిలో బోరు వేయగ నీళ్లు పడడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేసి ఎమ్మెల్యే కోట్లకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏరియా బూత్ ఇంచార్జీ కానాల అంజి, టిడిపి నాయకులు వడ్డే వెంకటేశ్వర్లు బోయ శీను తదితరులు పాల్గొన్నారు.

## దీన్‌దయాల్ ఉపాధ్యాయ అందరికి ఆదర్శప్రాయుడు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** భారతీయ జన సంఘం వ్యవస్థాపకుడు అయిన పండిత దీన్ దాయల్ ఉపాధ్యాయ అందరికి ఆదర్శ ప్రాయుడని మండల బీజేపీ అధ్యక్షుడు మునిస్వామి గౌడ్, జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు గద్వాల రవి కుమార్ నాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని బీజేపీ కార్యాలయం నందు పండిత దీన్ దాయల్ ఉపాధ్యాయ బలిదాన్ దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. దీనదయాల్ చిత్రపటానికి పూల వేసి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఎం.ఈ.ఒకు ఘన సన్మానం



సన్మానం చేస్తున్న దృశ్యం

చాగలమర్రి, మేజర్‌న్యూస్‌ః చాగలమర్రి మండల నూతన ఎం.ఈ.ఒగా బాధ్యతలు చేపట్టిన శేషసైనా రెడ్డికి ఘనసన్మానం లభించింది. చాగలమర్రి పట్టణంలోని ఎం.ఆర్.సి కార్యాలయంలో చైతన్య భారతి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పూలమాల, శాల్వతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చంద్రమౌళి, హెచ్.ఎం రఫి తదితరులు పాల్గొన్నారు.

## కాలేయ వ్యాధి బాధితుడికి సహాయం

**చాగలమర్రి, మేజర్‌న్యూస్‌ః**
కాలేయ వ్యాధితో బాధపడుతున్న బాధితుడికి టీడీపీ నాయకులు సహాయాన్ని అందించారు. చాగలమర్రి పట్టణంలోని న్యూబిల్డింగ్స్ కాలనీకి చెందిన కోరుమామిళ్ల సురేష్ గత కొంత కాలంగా కాలేయ వ్యాధి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. చికిత్స చేయించుకొనే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బలిజ సామాజిక వర్గ నాయకులు ఒక నెల సరిపడా మందులను ఉచితంగా అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎవరైనా దాతలు బాధితుడు సురేష్‌కు ఆర్థిక సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లెం మురళీ, జట్టి నాగరాజు, ఆవుల ప్రతాప్, జట్టి సుధాకర్, కుమార్, కామిశెట్టి రమేష్ , సాయి, ప్రవీన్ తదితరులు ఉన్నారు.

### పెద్దురాజుల స్వామి దర్గా దర్శనం...

# కోరికలు తీరే భాగ్యం

- మతసామరస్యానికి ప్రతీక స్వాములవారి ఉరుసు
- నేటి నుంచి ఉరుసు మహెూత్సవం
- రైతువారి పట్వాడీలో సంబరాలు



దర్గాలో స్వాములవారు



ముస్తాబు అయిన దర్గా

**నందవరం, మేజర్‌న్యూస్:** ఎంతో మహిమానితులు పొనకల దిన్నె పెదరాజుస్వాములు.. ఆయన భక్తితో చేసిన మహిమలతో కొలిచి కోరేవారి కోర్కెలు తీరుతాయన్న భక్తుల నమ్మకం .. ఓ గ్రామం ఆయన పట్వాడి కింద రైతు సంబరాలు జరుపుకుంటుంది.. ఏళ్ల చరిత్ర కలిగిన స్వాముల వారి ఉరుసుకు సుదూర రాష్ట్రాలనుండి భక్తులు తరలి వస్తారు.. స్వాములవారి మహిమలు ఎంత గొప్పవో అద్దం పడుతుంది.. కొలిచే వారి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న పెదరాజు స్వాముల వారు ఉరుసు మూడురోజులు వైభవంగా జరుపు కుంటారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీశ్రీశ్రీ పెదరాజుల స్వామి ఉరుసు మహోత్సవా లు సందర్భంగా స్వాములవారి దర్శనం మహాపుణ్యఫలం అని భక్తులు నమ్మకంతో మతసామస్యానికి అతీతంగా పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. ప్రతిఏటా మాఘమాసంలో ఉరుసు ఉత్సవం నిర్వహించడం జరుగుతుంది. ఎంతో మహోన్నత చరిత్రకలిగిన స్వాముల వారి దర్గా నంద వరం మండలం పొనకలదిన్నెలో వెలసింది.. ఇరుగు పొరుగు రాష్ట్రలతోపాటు మహారాష్ట్ర నుండి భక్తులు స్వాముల వారిని దర్శించుకోవడాని వచ్చేస్తుంటారు.. గ్రామంలోని రైతు సంఘం, దర్గా పీఠాధిపతులు సయ్యద్ అక్బర్‌భాషా ఖాద్రీ, ఉపపీఠాధిపతులు (ముతావలి) సయ్యద్ ఇద్రూస్ బాషా ఖాద్రీ, కుటుంబ సభ్యులు షాబాషాఖాద్రీల ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు.. కుల, మతాలకు అతీతంగా జరిగే ఉత్సవాల్లో స్వాముల వారికి మొక్కులు తీర్చుకుంటారు.. పకీరుల విన్యాసా లు కళ్లను అబ్బురపరుస్తాయి అనేదానిలో అతిసయోక్తిలేదు.

**నేడు వైభంగా గంధం మహోత్సవం**

గురువారం సాయంత్రం స్వాములవారి గంధం మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. తుంగభద్ర నది నుండి అశ్వంతో జలాలు తీసుకురాగా ఊరు పెద్దలు దర్గా షీఠాదిపతులు శ్రీ సయ్యద్ అక్బర్ భాషా ఖాద్రీ, ముతావలి సయ్యద్ ఇద్రూస్‌బాషాఖాద్రీ, పెద్దలు సయ్యద్ సాయిషాభాషాఖాధ్రిలతో కలిసి పెద్దెత్తున గంధం మహోత్సవం సాగనుంది.

**దర్గా చరిత్రః** కొన్ని వందల ఏళ్ల క్రితం సౌది అరేబియా దేశంలోని జిద్దా సమీపాన గల ఆదీన పట్టణంలో జన్మించిన శ్రీ పెదరాజుల స్వాముల వారు 9వ ఏటనే భారతదేశానికి చేరుకుని కర్ణాటక రాష్ట్రంలో బీజాపూర్ లోని శ్రీ సయ్యద్‌షా అబ్దుల్ రహీంఖాద్రీబాషా దగ్గర నివాసం ఉన్నారు. ఆతర్వాత కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో నివా సం ఏర్పర్చుకున్నారు.అక్కడ ఉన్న సమయంలో పట్టణంలో జమీయామజీదు నిర్మాణం మొదలు పెట్టారు ఈ పనులు రోజు చేపట్టిన పనులు రోజు కూలిపోవడం జరుతున్న నేపద్యంలో అక్కడి ముస్లింలు పెదరాజుల స్వామి మహిమలు తెలుసుకుని మజీదు నిర్మాణానికి ఆయన చేత పునాదిరాళ్లు వేయించారు. నాటి నుండి మజీదు నిర్మాణం ఎక్కడ ఆటంకాలు కలగకుండా నిర్మాణం ముందుకు సాగింది. ఔరంగజేబు పాలనలో ఇందుకు ప్రత్యేకంగా స్వాముల వారికి అప్పటి గవర్నర్ నద్దీమజీద్‌ఖాన్ పొనకలదిన్నె గ్రామంతో పాటు 2,500 ఎకరాలు భూమిని జాగీరుగా అందించారు. బేతంచర్ల మండలం గూటుపల్లెలో ఉన్న పెదరాజుల స్వామి మనవడు సయ్యద్‌సాయి షా ఖాద్రీ పొనకలదిన్నె రైతులకు 2,000 ఎకరాలు అందులో నుండి రైతు వారి పట్టాగా దారాదత్తం చేశారు. మిగులు 500 ఎకరాలు కూడా దారాద త్తంగా రైతులకు అందించడం జరిగింది. మహి మానితులు అయిన స్వాములవారి మనవడు సయ్యద్‌సాయి షాఖాద్రీ పొనకలదిన్నెలో జీవసమా ది అయ్యారు. ఈదర్గా పీఠాధిపతులు సాంబ్రాని మంత్రించి అందిస్తే మొలలు, నూతి, దేడనూతి, కంటినూతి,అరిసెమొలలు నయం అవుతాయని విశ్వసిస్తారు.

దర్గాకు చేరుకోవాలి అంటే..
ఎమ్మిగనూరు.. కర్నూలు వయా గూడూరు, సి. బెళగల్ మండలం కేంద్రాలమీదుగా కర్నూలు వెల్లే దారిలో దైవందిన్నె గ్రామంలో బస్సుదిగి అక్కడి నుండి 2 కి.మీ వెల్లితే దర్గాను చేరుకుంటారు. ఎమ్మిగనూరు నుండి టి.సోమలగూడూరు గ్రామానికి వెళే వాహన మార్గంతో గ్రామంలోనే దిగేఅవకాశం ఉంది.



పీఠాదిపతులు
అక్బర్‌బాషా ఖాద్రీ



ఉపపీఠాధి పతులు
(ముతావలి) సయ్యద్
ఇద్రూస్ బాషా ఖాద్రీ

## సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

వెలుగోడు, మేజర్‌న్యూస్ : సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని వేల్పనూరు గ్రామంలోని ఆయన స్వగృహంలో బుధవారం నియోజకవర్గానికి చెందిన 41 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.23 లక్షల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ఆధారంగా సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

### సేవాలాల్ జయంతి వేడుకలు

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** ఈ నెల 14, 15న అనంతపురం జిల్లాలోని సేవాఘడ్‌లో శ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరుగునని వైస్ ఎంపీపీ శంకర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ జయంతి, మారెమ్మ దేవతల పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరుగునని తెలిపారు. భారతదేశంలోని నలుమూలల్లోని బంజారాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బద్దె నాయక్, తాను నాయక్, నాగరాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## లేగదూడల ప్రదర్శన కార్యక్రమం

వెలుగోడు, మేజర్‌న్యూస్ : రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా మండలంలోని బోయరేవుల గ్రామంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమంలో కర్నూలు జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా.రాజశేఖర్, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ అన్నారపు శేషిరెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ నేటి దూడలే రేపటి పాడి పశువులు అని దూడలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు వేయించుకోవాలని టీకాలు సకాలంలో వేయించి జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వెలుగోడు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డా.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు లింగ నిర్ధారిత వీర్యం వినియోగించుకుని 90 శాతం పెయ్య దూడలను పొంది తద్వారా పాల ఉత్పత్తిని పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మేలైన యాజమాన్య పద్ధతులను పాటించి మినీ గోకులాలు, హరిత గోపాలం ద్వారా పశుగ్రాసాల సాగును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి 70 దూడలు వచ్చాయి. రైతులకు బహుమతులు, లివర్ టానిక్‌లు, మినరల్ బ్లాక్‌లు అందజేశారు. అలాగే లేగదూడల కిట్లను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు అబ్దుల్ కలాం, మోమిన్ రసూల్, గ్రామ సర్పంచు సామన్న, పశు వైద్యాధికారులు, పారా సిబ్బంది, ఏహెచ్‌ఏలు, గోపాలమిత్రలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు, తెదేపా నాయకులు

### తల్లిదండ్రుల కళ్యాణానికి

## వినాయకుడి పట్టువస్త్రాలు



స్వాగతం పలుకుతున్న అధికారులు

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవానికి కాణిపాక వినాయక దేవస్థానం నుండి పట్టు వస్త్రాలు సమర్పించారు. తల్లిదండ్రుల కళ్యాణ మహోత్సవానికి తనయుడు పట్టువస్త్రాలను సమర్పించడం అనవాయితీగా వస్తుంది. బుధవారం కాణిపాకం దేవస్థానం ఈవో పెంచకల కిషోర్, చైర్మన్ సురేందర్‌బాబు, ధర్మకర్తలు, వేద పండితులు, ప్రధాన అర్చకులు తీసుకొచ్చిన పట్టు వస్త్రాలకు ఆలయంలోని ముఖమండపం వద్ద స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీకామేశ్వర సమేత మహానందీశ్వర స్వామివార్లకు తీసుకొచ్చిన పట్టు వస్త్రాలకు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, వేద పండితులు బ్రహ్మశ్రీ రవిశంకర్ అవధానిలకు అందజేశారు. అధికారులను కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివార్ల ప్రసాదాలను అందజేస్తూ ఆశీర్వాదం అందించారు. పట్టువస్త్రాలను తీసుకొచ్చిన అధికారులకు మహానంది పండితులు వేద ఆశీర్వాదం అందించారు.

## 17న జిల్లా స్థాయి శాప్ లీగ్ పోటీలు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన జిల్లా స్థాయి శాప్ లీగ్ చదరంగం పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు తెలిపారు. బుధవారం ఆయన ఔట్‌డోర్ స్టేడియంలో మీడియాతో మాట్లాడారు. నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో అండర్-13, 15, 17, 19 బాల బాలికల విభాగాలలో చదరంగం పోటీలు ఉంటాయని వివరించారు. జిల్లా స్థాయి చదరంగం పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 23వరకు తిరుపతిలో జరగబోయే రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ పోటీలకు జిల్లా తరపున అర్హత సాధిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 08518-225419ను సంప్రదించాలన్నారు.



భూపతిరావు

## 15లోపు ఇంటి పన్ను వసూళ్లు పూర్తి చేయాలి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలు ఈ నెల 15వ తేదీ నాటికి ఇంటి పన్ను వసూళ్లను 100శాతం పూర్తి చేయాలని డిడిఓ రమణారెడ్డి ఆదేశించారు. బుధవారం నన్నూరు గ్రామ సచివాలయంలో డిఎల్‌పిఓ, డిప్యూటీ ఎంపిడిఓ శాంతయ్యతో పాటు పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాల వారిగా వసూళ్ల పురోగతిని పరిశీలించారు. లక్ష్యానికి తగ్గట్టుగా వసూళ్లు జరగని పంచాయతీలపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, తక్కువ వసూళ్లు ఉన్న గ్రామాల కార్యదర్శులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించి చర్యలు తీసుకునేలా సిఫారసు చేస్తామని తెలిపారు. ప్రభుత్వానికి రావాల్సిన ఇంటి పన్ను ఆదాయాన్ని సమయానికి వసూలు చేయడం గ్రామ పంచాయతీల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. వసూళ్లలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నన్నూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి బషీరున్ బీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఘంటసాల వర్ధంతి

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్:** జిల్లా రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని తెలుగుతోటలో స్వర్గీయ గానగంధర్వులు అమరజీవ ఘంటసాల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఘంటసాల చిత్రపటానికి కళా కారులు ఘన నివాళులర్పించారు. ఈ కార్య క్రమం ఉపాధ్యక్షులు డి దస్తగిరి, ప్రధాన కార్యదర్శి పెనికిలపాటి హనుమంతరావు చౌదరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఘంటసాల గానం గాత్రం పద్యం ప్రతి తెలుగు ఇంటి ప్రతిరోజు వినిపిస్తుందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులుగా, గాయకులుగా, సంగీత దర్శకులుగా, నటు డిగా వివిధ శాఖలలో నిష్ణాత కలిగిన విశేష్ట కళాకారులు ఘంటసాల అని కార్య నిర్వాహక కార్యదర్శి బైలుప్పుల షఫీవుల్లా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, సుబ్బయ్య, పెద్ద వెంకటేశ్వర్లు, షేక్షావలి, భాస్కర్ రెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, రాజన్న, కళాకారులు పాల్గొన్నారు.




నివాళులర్పిస్తున్న కళాకారులు

## గుమ్మనూరును విమర్శించే అర్హత లేదు

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** గుంతకల్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంను విమర్శించే అర్హత మంత్రాలయం స్థానిక నాయకులకు లేదని మంత్రాలయం టీడీపీ మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రాలయం మండల కేంద్రంలో టీడీపీ టౌన్ ఇంచార్జీ వరదరాజులు ఆధ్వర్యంలో మంచాల సింగిల్‌విండో చైర్మన్ రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని బాణసంచ పేల్చి కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ, గత జగన్ ప్రభుత్వ హయాంల శ్రీవారి లడ్డులో కల్తీ జరిగింది వాస్తవమేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంపిటీసీ మేకల వెంకటేష్, నరసింహా ఆచారి, పవన్ కుమార్, ఆర్.కె.రఘు, రచ్చుమర్రి నరసింహులు, గోపాల్, లింగప్ప, వీరారెడ్డి, సొసైటీ డైరెక్టర్ భీమన్న, రాజన్న, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

## రేపు మందకృష్ణ మాదిగ రాక

**ఆస్పరి, మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహిత మందాకృష్ణ మాదిగ శుక్రవారం విచ్చేస్తున్న సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. బుధవారం ఆస్పరి స్థానిక ఎస్సీ కాంప్లెక్స్ నందు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పిఎస్ ఆస్పరి మండల అధ్యక్షులు, దేవనకొండ మండల ఇంచార్జీ చిన్న సంజన్న మాదిగ, ఎంఎస్‌పి మండల అధ్యక్షులు రామాంజనేయులు మాదిగ పాల్గొని కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఎమ్మార్పిఎస్ ఆస్పరి మండల అధ్యక్షులు, దేవనకొండ మండల ఇంచార్జీలు చిన్న సంజన్న మాదిగ, ఎంఎస్‌పి మండల అధ్యక్షులు రామాంజనేయులు మాదిగలు మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలు మరువలేనివని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో పులి కరుణాకర్ మాదిగ, పరమేష్ మాదిగ, హుసేన్ మాదిగ, తాయన్న, గోవిందు మాదిగ, నాగన్న మాదిగ, మల్లేష్ మాదిగ, పెద్దయ్య మాదిగ, ఈరన్న మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పిఎస్ నాయకులు

# పది ఉత్తీర్ణతపై నిర్లక్ష్యం వద్దు




ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జేసీ నూరుల్ కమర్



మురుగు కాల్వను పరిశీలిస్తున్న జేసీ

**దేవనకొండ, మేజర్‌న్యూస్:** పదవతరగతి విధ్యార్థుల ఉత్తీర్ణతపై నిర్లక్ష్యం వహించకుండా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్‌తో కలిసి బుధవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు సంబంధించిన ఎస్1,ఎస్2, ఎస్3 పరీక్షల ఉత్తీర్ణత రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తీర్ణత మెరుగ్గా లేదని, ఇలా అయితే రానున్న పదవతరగతి పరీక్షలలో మెరుగైన ఉత్తీర్ణత ఎలా అని ప్రశ్నించారు. వెనుకబడిన విద్యార్థులను గమనించి పదవతరగతి పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించేలా సబ్జెక్టుల వారీగా శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు.

**పాఠశాల ముందు ఇలా ఉంటే ఎలా?**

పాఠశాల ముందు మురుగు కాలువని చూసిన జెసి ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి రాముడుని పిలిపించి విద్యార్థులు చదువుతున్న పాఠశాల ముందు మురుగు కాలువ పేరుకుపోయిందని, ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. గ్రామంలో ఎన్ని రోజులకు ఒకసారి పారిశుధ్య పనులు చేపిస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే పారిశుధ్య పనులు చేపట్టి శుభ్రత పాటించాలని ఆదేశాంచారు. ఈ కార్యక్రమంలో తహసీల్దా ర్ సుదర్శనం, ప్రధానోపాధ్యా యులు నజీర్ అహ్మద్, ఆర్ఐ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



యాత్రికులకు వ్యాక్సినేషన్ వేస్తున్న వైద్యులు

**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా నుండి హజ్ యాత్ర మక్కా వెళ్లే యాత్రికులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.ఎల్ భాస్కర్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.ఉమా ఆధ్వర్యంలో అన్ని వైద్య చికిత్సలు నిర్వహించి 155మందికి తగిన సలహాలు, సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అలీఖాన్, స్థానిక హజ్ కమి టీ సభ్యులు, కార్యాలయ సిబ్బంది, వైద్య అధికారులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి వేడుకలు

**డోన్, మేజర్‌న్యూస్:** పట్టణంలోని బీజేపి కార్యాలయంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకటరమణ ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సందు వెంకటరమణ మాట్లాడుతూ సమాజంలోని చిట్టచివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు అందాలంటూ, సుపరిపాలనకు దిశా నిర్దేశం చేసిన మహనీయుడనీ, ఒక రాజకీయ శాస్త్రవేత్త అని, ఆయన వర్ధంతి రోజును సమర్పణ దివాస్‌గా మనం జరుపుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు బండి కిరణ్, డోన్ మండల అధ్యక్షుడు బొంకూరి రవికుమార్, సీనియర్ నాయకులు బొగ్గరపు నటరాజ్, సురేష్, నంద్యాల జిల్లా ఐటి కన్వీనర్ అరబోలు వీరేష్, డోన్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆలా శివప్రకాష్, డోన్ పట్టణ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.




నివాళులు అర్పిస్తున్న బీజేపి నాయకులు

## ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లింపుపై హర్షం

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం బిసి విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం రూ.736కోట్లు విడుదల చేయడం హర్షణీయమని నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేస్తుందని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నిధులను నేరుగా కళాశాల ఖాతాల్లోకే వేస్తోందని చెప్పారు. విద్యకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదనే సంకల్పంతో తీసుకున్న ఈ చర్యను స్వాగతిస్తున్నట్లు చెప్పారు.



రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయ్ కుమార్

# బాధితులకు రక్షణ కల్పించండి

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** కల్లూరు వక్కెర వాగు సమీపంలోని టైలర్స్ కాలనీలో నివసిస్తున్న చిన్న ఈరమ్మ, శేషయ్య కుటుంబాలకు రక్షణ కల్పించాలని జిల్లా క్యాటరర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పేగు సత్యనారాయణ తెలిపారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా బాధితులు ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏఓకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ శేషయ్య, చిన్న ఈరమ్మ కుటుంబాలు గత 35ఏళ్లుగా టైలర్స్ కాలనీలో వంటలు చేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నారని తెలిపారు. వరదల సమయంలో వారి ఇంటికి సంబంధించిన పత్రాలు కొట్టుకుపోయిన విషయం తెలుసుకున్న కర్నూలు నగరానికి చెందిన బషీర్ అహ్మద్, మునీర్ అహ్మద్, కరీం ఖాన్, సులేమాన్‌లు ఆ స్థలంపై కన్నేసి పత్రాలు సృష్టించి, రాజకీయ నాయకులు, పోలీసుల పేర్లు ప్రస్తావిస్తూ కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధిత కుటుంబాలకు తక్షణమే రక్షణ కల్పించి, నిజా నిజాలు వెలికి తీసి న్యాయం చేయాలని కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి రాష్ట్ర నాయకులు తూముకుంట ప్రతాప రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు రవి, నాగేశ్వరరావు, యుగంధర్ శెట్టి, పోలేపల్లి శేషయ్య, హరికిషన్, క్యాటరర్స్ అసోసియేషన్ నాయకులు ప్రసాదరావు, బచ్చు ప్రసాద్, కొండయ్య, సూరిశెట్టి తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో కలిసి నిరసన చేస్తున్న నాయకులు

## వందశాతం పన్ను వసూలు చేయాలి

**చాగలమర్రి, మేజర్‌న్యూస్‌:** ఇంటి పన్నులను ఈ నెల 15వ తేదీ నాటికి 100శాతం పూర్తి వసూలు చేయాలని జిల్లా డివిజనల్ డెవలప్ మెంట్ అధికారి శివారెడ్డి తెలియ జేశారు. చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ తాహిర్ హుసేన్, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ డిప్యూటీ ఎంపిడిఒ తారకే శ్వరీల ఆధ్వర్యంలో పంచా యితీ కార్యదర్శు లు, వెల్ఫేర్ సహాయకులతో బుధవారం సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు ఆయా గ్రామాల ఇంటి పన్నులను ఇతరత్ర పన్నుల ను ఈ నెల 15 నాటికి వసూలు చేయాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. ఫ్రీజ్‌లో ఉన్న సర్పంచ్‌ల బ్యాంకు ఖాతాలను ఈకేవైసి చేయించాల న్నారు. అలాగే అక్షర ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులను దద్దత తీసుకున్న వారు రోజు హాజరు తీసుకొని చదువు నేర్పిం చి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఏకీకృ త కుటుంబ సర్వే త్వరితగతిన పూర్తి చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో పంచాయి తీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఆదినారయణ, రాజేష్ , చిన్నబ్బి, జి.ఎం.ఎస్.ఎలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ శివారెడ్డి

## ఊరి బడిని కాపాడుకుందాం

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** రాష్ట్ర యుటిఎఫ్ పిలుపు మేరకు ఫిబ్రవరి నెల నుండి బడి ఈడు పిల్లలందర్నీ ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్చే కార్యక్రమం యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు ఈ స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొని విజయవంతం చేయాలని యుటిఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌లతీఫ్ అన్నారు. అందులో భాగంగా బుధవారం విద్యాశాఖ కార్యాలయం నందు ఊరి బడిని కాపాడుకుందామనే పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్యాపిలి మండల అధ్యక్షులు రాజేంద్ర, సహాధ్యక్షులు నాగమణి, జిల్లా కౌన్సిలర్లు షేక్షావలి, అమీర్‌భాషా, భాషా, అస్మాబేగంచ, శ్రావణి, రాజు, సురేష్‌లు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

## శవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** లేబర్ కోడ్స్‌ను తిప్పికొడుదామని, అందుకు నిరసనగా చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ, ఏఐటియుసి, సిఐటియుసి, ఐఎఫ్‌టియు సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షతన మండల కార్యదర్శి మహేష్‌లు సార్వత్రిక సమ్మె కరప త్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు, హమాలి సంఘం నాయకులు గోవిందు, శ్రీనివాసులు, రమేష్, పెద్దశీను తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

## ఆర్థిక చైతన్యం కోసం అవగాహన శిబిరం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఆర్థిక అక్షరత వారోత్సవాలు సందర్భంగా ఆర్‌బిఐ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణా పిజి కళాశాల ఆడిటోరియంలో బుధవారం అవగాహన శిబిరం నిర్వహించారు. కళాశాలల చైర్మెన్ రామకృష్ణా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీందర్, ఆర్‌సిటీ డైరెక్టర్, యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు, వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు, తదితరులు హాజరయ్యారు. సుమారు 160 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బ్యాంకింగ్ సేవలు, పొదుపు బాధ్యత, డిజిటల్ లావాదేవీలు, ఆర్థిక ప్రణాళికపై అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. యువతలో బాధ్యతాయుత ఆర్థిక ప్రవర్తన పెంపొందించడమే కార్యక్రమం లక్ష్యం అని తెలిపారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

## సువార్త కూడికలకు ఆర్థిక సాయం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల 38వ వార్డు వైఎస్సార్ నగర్‌లో నిర్వహించిన సువార్త కూడికలకు టీడీపీ సీనియర్ నాయకుడు, వార్డు ఇన్‌చార్జ్ తాటికొండ బుగ్గరాముడు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మంత్రి ఎన్ఎండి ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ఆదేశాల మేరకు ఆర్థిక సాయం అందజేసినట్లు తాటికొండ బుగ్గరాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో క్రీస్తు సందేశాన్ని ప్రజలకు బోధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డేనియల్, పాస్టర్ పాల్‌జోసఫ్, టీడీపీ నాయకులు ఇమామ్ హుస్సేన్, వడ్డె నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న తాటికొండ బుగ్గరాముడు

## మెడికల్ మాఫియా దోపిడికి అడ్డుకట్ట వేయాలి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో మెడికల్ మాఫియా పెత్తనానికి అడ్డుకట్ట వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిపిపి విధానంతో ప్రభుత్వ ఆసుపత్రులు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్తే పేదలకు వైద్యం దూరమవుతుందని మండిపడ్డారు. ఫిబ్రవరి 14న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే సిపిఐ ఆందోళనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చిన్న క్లీనిక్‌ల నుంచి కార్పొరేట్ ఆసుపత్రుల వరకు కమీషన్ల దందా ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. మెడికల్ కళాశాలల్లో అక్రమాలు, ఫార్మసీ రంగంలో మాఫియా పెత్తనంపై సమగ్ర విచారణ చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాబా ఫకృద్దీన్, నాగరాముడు, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

## మహాశివరాత్రి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్‌:** డోన్ పట్టణంలోని చాకిరేవు మిట్ట దగ్గర గల శ్రీశ్రీశ్రీ కామాక్షి సమేత అమరలింగేశ్వరస్వామి దేవస్థానం నందు మహాశివరాత్రి మహోత్సవాలు కంచికామకోటి పీఠం జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీమాణిక్యప్రభు సేవా సమితి, అమరలింగేశ్వరస్వామి దేవస్థానం, స్వచ్ఛంద సేవా కార్యకర్తలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం మహాశివరాత్రి రోజున స్వామి వారికి అభిషేకాలు, సోమవారం కళ్యాణోత్సవం, మంగళవారం పల్లకిసేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులు స్వామి వారిని దర్శించుకొని మహోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

## ఘనంగా గోవిందు నాయన ఆరాధన



సమాధి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ : మండల కేంద్రమైన ఉయ్యాలవాడకు చెందిన ఆధ్యాత్మిక తత్వవేత్త గోవిందు నాయన 56వ వర్ధంతి కార్యక్రమాన్ని వేణుగోపాలస్వామి ఆశ్రమ నిర్వాహకులు, ఆయన కుటుంబ సభ్యులు కలిసి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక భగవద్గీత పారాయణాన్ని నిర్వహించారు. ఆశ్రమవాసి మహానందిస్వామి మాట్లాడుతూ గోవిందు నాయన అవధూత సుబ్బారెడ్డి స్వామి వారికి వేదాంతం రామన్నకు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందజేసిన గురువు అన్నారు. గ్రామస్తులకే కాకుండా పరిసర గ్రామాల్లో ఉన్న ఆధ్యాత్మికవేత్తలకు గీతా జ్ఞానాన్ని పెంచిన మహనీయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గోవిందు నాయన వంశీయులు వెంకటనరసింహులు, గౌరి దంపతులు, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, వెంకటనాగేశ్వర్ రెడ్డి, బిసిఎస్‌ఆర్ పాఠశాల అధ్యక్షురాలు బుడ్డా తులసమ్మ, తళారి ఓబయ్య దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పద స్థలానికి కంచె ఏర్పాటు

ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ : తుడిమెలదిన్నె సర్వే నెంబరు 92లో 0.50 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో ఒక వర్గానికి చెందిన వారు ప్రార్థనా స్థలాన్ని నిర్మించాలని పిజిఆర్ఎస్ నంద్యాలలో ధరఖాస్తు చేసుకోగా గ్రామస్తులు అభ్యంతరం చెప్పారు. ఈ విషయంపై మండల అధికారులు గ్రామసభ ఏర్పాటు చేసి ఈ స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాలని గత నెల జనవరి 28న గ్రామసభలో తీర్మాణం చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ ఉమామహేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి జయరాంరెడ్డి, గ్రామ సర్వేయర్ శశికళ, ఇతర సచివాలయ సిబ్బంది బుధవారం ఈ ప్రదేశంలో కొలతలు వేయించి హద్దులు ఏర్పాటు చేశారు.

## వలసలు నివారించాలి



డిఆర్‌ఓకు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** పశ్చిమ ప్రాంతంలో కూటమి ప్రభుత్వం వలసలను నివారించాలని కాంగ్రెస్ పార్టీ కోడుమూరు ఇంచార్జ్ అనంతరత్నం మాదిగ అన్నారు. బుధవారం డిఆర్‌ఓకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలు ఉపాధి లేక వేరే రాష్ట్రాలకు వెళ్తున్నారన్నారు. ఇంటివద్ద ముసలి వారిని వదిలిపెట్టి పిల్లాపాపలతో వెళుతున్నారన్నారు. ఈ విషయాన్ని గమనించి తక్షణమే మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు ఉపాధి కల్పించి వలసలు నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపోగు కళావతి, సోమసుందరం తదితరులు పాల్గొన్నారు.

## కుట్టుమిషన్లు విరాళం

**అవుకు, మేజర్‌న్యూస్‌:** అవుకు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినుల నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సకరంగా బి.సి ఇందిరమ్మ విద్యార్థినుల స్వయం శక్తిని పెంపొందించే ఉద్దేశంతో ఐదు కుట్టుమిషన్లను పాఠశాలకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బి.సి ఇందిరమ్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యా నైపుణ్యాలు అలవర్చుకోవడం వల్ల బాలికలకు భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. బి.సి ఇందిరమ్మకు ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మల్లీశ్వరీ, విజయలక్ష్మి, చల్లా విజయ భాస్కర్ రెడ్డి రాధిక, నాగలక్ష్మి, పుష్పావతి, సుధారాణి, యమున బాయి, రాజశేఖర్ శర్మ, ప్రత్యూష, లక్ష్మిదేవి, శశికళ, రాజేశ్వరీ, వి. విజయకుమారి, పి.ఈ.టి టీచర్ వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లను అందిస్తున్న ఇందిరమ్మ

## ఘనంగా శ్రీకాశిరెడ్డినాయన ఆరాధన మహోత్సవాలు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్‌:** డోన్ మండలం, ఓబులాపురం గ్రామ పంచాయితీ రేకులకుంట గ్రామ స్టేజ్ 44వ నెంబర్ జాతీయ రహదారి దగ్గర శ్రీకాశిరెడ్డినాయన 21వ ఆరాధన మహోత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. మంగళవారం గణపతి పూజ, కాశీనాయనకు, ఆంజనేయస్వామికి, అన్నపూర్ణేశ్వరి దేవికి అభిషేకాలు, మంత్ర పుష్పం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగములు కమిటీ సభ్యులు, భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా, బుధవారం అంతరాష్ట్ర న్యూ కేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలను గ్రామపెద్దలు, నిర్వహకులు పూజలు చేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. అనంతరం గెలుపొందిన వృషభాల యజమానులకు 1వ బహుమతి రూ.30వేలు, 2వ బహుమతి రూ.20వేలు, 3వ బహుమతి రూ.10వేలు, 4వ బహుమతి రూ.5వేలు, 5వ బహుమతి రూ.3వేలు నగదు అందజేశారు. అలాటే కోలాటం, దాండియా కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. ఈ ఆరాధన మహోత్సవాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శ్రీకాశిరెడ్డినాయన ఆశీర్వాదం తీసుకున్నారు.



శ్రీకాశిరెడ్డినాయనను దర్శించుకుంటున్న భక్తులు

సూర్య
గురువారం | 12 ఫిబ్రవరి 2026

ఆలయాల పేరిట వచ్చే వెబ్ సైట్‌లు, యాప్‌లను

# ఏ మాత్రం నమ్మొద్దు

◆ ఎస్పీ విక్రాంత్‌పాటిల్



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** మహా శివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సైబర్ నేరగాళ్లు ఆలయాల పేరిట నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లు సృష్టించి మోసాలకు పాల్పడతారని, భక్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వివిధ శైవ క్షేత్రాలకు భారీగా భక్తులు తరలివెళ్లే అవకాశం ఉన్నందున, ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ నేరగాళ్లు సత్రాలు లేదా వసతి గదుల బుకింగ్, ఆన్‌లైన్ దర్శన టికెట్లు, ప్రత్యేక పూజల పేర్లతో నకిలీ వెబ్‌సైట్లు, లింకులు సృష్టించి మోసాలకు పాల్పడుతుంటారన్నారు. దర్శన టికెట్లు, సత్రాలు, గదులు, ప్రత్యేక పూజల బుకింగ్ కోసం కేవలం అధికారిక ఆలయ వెబ్‌సైట్లు లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన యాప్‌లను మాత్రమే ఉపయోగించాలన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు నంబరు, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోకూడదన్నారు. ఏదైనా సైబర్ మోసానికి గురైనట్లయితే 1930కు ఫోన్ చేయాలన్నారు.

## అక్షరాంధ్ర తరగతులను సందర్శించిన కమిషనర్



అక్షరాంధ్ర తరగతులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా నంద్యాలలోని చాంద్‌బాడాలో నిర్వహిస్తున్న అక్షరాస్యత తరగతులను మున్సిపల్ కమిషనర్ శేషన్న పరిశీలించారు. అలాగే మెప్మా ప్రాజెక్ట్ సంచాలకులు, మెప్మా పట్టణ సమన్వయ నిర్వాహకులు పరిశీలించారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని చదువు నేర్చుకుని అక్షరాస్యులుగా మారాలని అన్నారు. ఫిబ్రవరి 28న జరిగే ముందస్తు పరీక్షల్లో, మార్చి 29న నిర్వహిస్తున్న తుది పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణులు కావాలని కోరారు. అక్షరాస్యత శాతం పెంచే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# శివయ్యా..శరణు..శరణు

◆ జ్యోతిర్ముడి సమర్పించిన వస్వాములు
◆ శివ స్వాములకు నేటితో ముగియనున్న స్వామివారి స్పర్శ దర్శనం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ఇల కైలాసమైన శ్రీగిరిలో ప్రణవనాదం హోరెత్తుతోంది. నల్లమల గిరుల్లో భక్తుల మల్లన్న న్మాసరణ మారుమోగుతోంది. శివయ్యా.. శరణు శరణు అంటూ మల్లన్న చెంతకు చేరుకుం టున్నారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవా లను పురస్కరించుకుని భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శిం చుకునేందుకు భక్తులు పాదయాత్రగా తర లివస్తున్నారు. పాతాళగంగలో పుణ్య స్నానా లు ఆచరించి కృష్ణమ్మకు ప్రత్యేక వాయనం సమర్పిస్తున్నారు. భక్తుల రద్దీతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు నిండి పోయాయి.జ్యోతిర్ముడి కలిగిన శివస్వాము లకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామివారి స్పర్శదర్శ నాన్ని కల్పిస్తున్నారు.నేటి గురువా రంతో శివ స్వాములకు స్వామివారి స్పర్శ దర్శనం ముగియనుంది.రేపటి నుండి భక్తులందరికీ కేవలం అలంకార దర్శనానికి మాత్రమే అనుమతించనున్నారు.



జ్యోతిర్ముడి సమర్పిస్తున్న శివస్వాములు

### పాదయాత్ర భక్తుల భద్రతపై నిఘా.. కెలాస ద్వారం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్క రించుకుని నల్లమల ఆటవీ ప్రాంతం మీదు గా పాదయాత్ర చేసుకుంటూ వచ్చే భక్తుల భద్రత కోసం శ్రీశైల దేవస్థానం ప్రత్యేక చర్యలు చేపట్టింది.ఇందుకోసం ఈ నెల 8న మహాశి వరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారం భం నుంచి కైలాస ద్వారం వద్ద అధునాతన టెక్నాలజీతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పా టు చేశారు. విద్యుత్ సౌకర్యం లేనప్పటికీ సోలార్ సహాయంతో ఇవి పని చేస్తాయి. ఈ కెమెరాలు సుమారు భీముని కొలను వరకు పాదయాత్ర భక్తుల ఫుటేజ్ రికార్డు చేస్తాయి.నల్లమల అడవిలో పాద యాత్ర భక్తులకు ఏదేని సమస్య వచ్చిన తక్షణమే సీసీ కెమెరాల ద్వారా తెలుసుకుని తక్షణ సహాయం అందిస్తున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.





మల్లన్న దర్శనానికి పాదయాత్రగా వస్తున్న భక్తులు

# శ్రీశైలానికి వచ్చే భక్తులకు మెరుగైన ఏర్పాట్లు

◆ గతం కంటే నాలుగు రెట్లు శ్రీశైలానికి భక్తుల రాక
◆ భక్తులు సంయమనం పాటించాలి
◆ జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**శ్రీశైలం,మేజర్ న్యూస్:**శ్రీశైల బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం పూర్తి స్థాయి ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. బుధవారం శ్రీశైలం కమాండ్ కంట్రోల్ రూంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం సమన్వయంతో దేవాదాయ, అటవీ,పోలీసు,రెవెన్యూ తదితర శాఖలు సమగ్ర చర్యలు చేపట్టాయని తెలిపారు.ఈ ఏడాది కాలినడకన వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మంగళవారం ఒక్కరోజే స్వామి, అమ్మవార్లను సుమారు 71 వేల మంది భక్తులు దర్శించుకున్నారని పేర్కొన్నారు.భక్తుల సౌకర్యార్థం స్పర్శ దర్శనం,అలంకార దర్శనం కోసం వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.స్పర్శ దర్శనానికి కొంత సమయం ఎక్కువగా,అలంకార దర్శనం తక్కువ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి

సమయంలో పూర్తవుతుందని చెప్పారు.అధిక రద్దీ కారణంగా దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టే అవకాశం ఉన్నందున భక్తులు సహనంతో వ్యవహరించాలని సూచించారు.శ్రీశైలం క్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడు ఆధ్యాత్మిక భావనతో దర్శనానికి వస్తారని,అదే భక్తి భావాన్ని దర్శనం పూర్తయ్యే వరకు కొనసాగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అలాగే క్షేత్ర పరిశుభ్రతను కాపాడేందుకు భక్తులు ఉపయోగించిన ఆహార పదార్థాల అవశేషాలు,ప్లాస్టిక్ వస్తువులను తప్పనిసరిగా డస్ట్‌బిన్స్‌లో వేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల సహకారంతో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు.రవాణా సౌకర్యం కోసం అదనంగా 460 బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు.జిల్లాలోని ఇతర శైవ క్షేత్రాల్లో కూడా ఇదే తరహా ఏర్పాట్లు చేపట్టామని,మహానంది క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.

## కుక్కల దాడిలో 20 గొర్రెల మృతి

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** కుక్కలు దాడి చేయడంతో 20 గొర్రెలు మృత్యువాతపడిన సంఘటన బుధవారం అల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రెల యజమాని చిన్న బాలగుర్రప్ప తనకున్న 50 గొర్రెలను మేపుకొచ్చిన అనంతరం ఇంటి సమీపంలోని రేకుల షెడ్డులో ఉంచేవాడు. అయితే మంగళవారం రాత్రి అందులోకి కుక్కలు చొరబడి దాడి చేయడంతో 20 గొర్రెలకు పైగా మృతి చెందాయి. బుధవారం ఉదయం వచ్చి చూడగా ఈ ఘటనను గమనించాడు. చనిపోయిన గొర్రెల విలువ రూ.2 లక్షలకు పైగా ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని గొర్రెల యజమాని కోరుతున్నాడు.

## సమన్వయంతో పనిచేద్దాం... ఉత్సవాలు దిగ్విజయం చేద్దాం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేతంలో ఈ నెల 13నుండి జరిగే మహాశి వరాత్రి బ్రహోత్స వాలను అన్ని శాఖాధికారులు సమన్వయంతో పని చేస్తూ భక్తులకు సేవ లందిస్తా



కోఆర్డీనేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

బ్రహోత్సవాలను దిగ్విజయం చేద్దామని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ తెలిపారు బుధవారం మహానంది క్షేత్రంలోని పోచా విశ్రాంతి భవనంలో రెండవ కోఆర్డీనేషన్ సమావేశాన్ని ఆర్డీవో అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో అన్ని శాఖాలాధికారులకు సూచనలు చేస్తూ వారి నివేదికలను తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా గంటలోపు దర్శనం చేసుకునేలా ఉండాలన్నారు. ఎక్కడ కూడా చెత్తచెందారం లేకుండా శానిటేషన్ పనులను శుభ్రం చేయించాలన్నారు. భక్తుల వసతులపై అధికారులతో సమీక్షించారు. ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి నివేదికను సమర్పించి భక్తుల సౌకర్థ్యం ప్రత్యేక క్యూలైన్లు దర్శనానికి వెళ్ళే భక్తులకు ప్రసాదాలు కొనుగోలు చేసే భక్తులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్ల వద్ద ఆలయ ప్రాగణంలో తాగునీరు, మజ్జిగ, ఉచితంగా అందిస్తున్నామన్నారు. వైద్యశిబిరాలను భక్తులు సేదా తీరేందుకు శామీయానాలతో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. ఏఎస్పీ జావలి మాట్లాడుతూ 100మంది పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నారు. సీసీ కెమోరాల నిఘాలో క్షేత్రంలో ఉంటుందన్నారు. భక్తుల సౌకర్యం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికట్టికప్పుడు సమాచారం ఇస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఆర్టీసి వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. విఐపిలు క్షేత్ర దర్శనానికి వస్తే ముందుగా అధికారులకు సమాచారం అందించాలన్నారు. వారికి దర్శనం కేటాయించిన సమయంలో రావాలని ఆర్డీవో తెలిపారు. ప్రసాదాలో క్వాలిటి ఉండేలా చూసుకోవాలన్నారు. క్షేత్రం పరిసరాల గుర్రాలు, పందులు, గాడిదలు తిరగకుండా యజమానులకు నోటీలు ఇచ్చి వాటిని రోడ్డు మీదకు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండి శేషన్న, తహశీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహమ్మద్‌దౌలా, వైద్యాధికారులు డాక్టర్ భగవాన్ దాస్, వెంకటరెడ్డి, ఉశేన్‌రెడ్డి , విద్యుత్ ఎఇ ప్రభాకర్‌రెడ్డి, ఆయా శాఖాధికారులు పాల్గొన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించారు.